క్లుప్తంగా

సమస్యల పరిష్కారంలో అ'ద్వితీయ'ం



కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన సమస్యలను పరిష్కరించడంలో విజయనగరం జిల్లా రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచిందని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ...రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవడంతో రాష్ట్ర స్థాయిలోనే మంచి గుర్తింపు లభించిందన్నారు. సాధ్యమైనంతవరకు ఫిర్యాదుదారుడితో మాట్లాడి వారి సమస్యను పూర్తిగా తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు.

కౌలు రైతులకు భూ ఆధార్



భూ ఆధార్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో పూడి నిర్మల

డెంకాడ: సొంత భూములున్న రైతులతో పాటు కౌలు రైతులకు కూడా భూ ఆధార్ నమోదు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల అన్నారు. మంగళవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో భూ ఆధార్ నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం 11 అంకెలతో రైతుకు భూ ఆధార్ కేటాయిస్తుందన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పొందేందుకు ఈ గుర్తింపు నంబర్ ఎంతోగానో ఉపయోగపడుతుందని చెప్పారు. భూ ఆధార్ నమోదుకు రైతులు ఆధార్‌కార్డు, వన్‌బీ, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబర్, రైస్ కార్డు జిరాక్స్‌లతో రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

నిలిచిన గోకులం నిర్మాణం



గోకులం నిర్మించాలనుకున్న ప్రదేశం ఇదే..

విజయనగరం రూరల్: మండలంలోని జొన్నవలస ఎస్సీ కాలనీలో సర్వే నంబర్ 80లోని 1లో స్థానికులు రెండు సెంట్ల గ్రామకంఠం భూమిలో మినీగోకులం నిర్మాణం చేపట్టడంతో కాలనీకి చెందిన పలువురు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వీఆర్‌ఓ జగదీష్, కార్యదర్శి రవి మంగళవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థలం గ్రామకంఠం కావడంతో పనులు నిలిపివేయించారు.

భూ ఆధార్‌కు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



ముంజేరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ హరికృష్ణ

భోగాపురం: సొంత భూములున్న రైతులందరూ తప్పనిసరిగా భూ ఆధార్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి వి. హరికృష్ణ అన్నారు. మండలంలోని ముంజేరులో భూ ఆధార్ ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పోర్టర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి 14 అంకెల ఐడీ నంబర్ కేటాయిస్తారన్నారు. దీంతో అన్ని రకాల వ్యవసాయ సంక్షేమ పథకాల లబ్ధి పొందవచ్చని సూచించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

విజయనగరం టౌన్: పైడితల్లి చదురుగుడి ఆలయ ఆధ్యాత్మిక కళావేదికపై మంగళవారం రాత్రి నిర్వహించిన ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను అలరించాయి. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ ప్రసాద్ నేతృత్వంలో పైడిమాంబ దీక్షా కళాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో పర్యవేక్షణలో కమ్మవీధికి చెందిన చిన్నారులు కత్తి, కర్రసాము, పులివేషాలు వంటి జానపద కళారూపాలను ప్రదర్శించారు. అనంతరం చిన్నారులను ఆలయ అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు ఏడుకొండలు, రమేష్ పట్నాయక్, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం

నెల్లిమర్ల: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంటా సత్యనారాయణ , ఓబీసీ విభాగం జిల్లా చైర్మన్ ఆర్. తారకేశ్వరరావు ఆరోపించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బీసీ కులాలకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం 34 శాతం మాత్రమే రిజర్వేషన్లు ప్రకటించడం అన్యాయమన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో బీసీలకు 42 నుంచి 45 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని తెలిపారు. అయితే బీసీ ఓట్లతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం మాత్రం రిజర్వేషన్ల విషయంలో తీరని అన్యాయం చేస్తోందని మండిపడ్డారు.

ప్రాణాలు పోయేవరకూ పట్టించుకోరా..!

- శిథిలావస్థకు చేరుకున్న పూసపాటిరేగ రక్షిత మంచినీటి పథకం ట్యాంక్
- వినియోగించవద్దని సూచించిన సౌండ్ ఇంజినీర్లు
- పంచాయతీ భవనం, జనావాసాలపై కూలే అవకాశం
- ఆందోళనలో ప్రజానీకం



అడుగుభాగంలో ఊడిన పెచ్చులు



శిథిలావస్థకు చేరుకున్న ట్యాంక్



సగం దెబ్బతిన్న పిల్లర్లు

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలోనున్న ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రమాదకరంగా మారింది. ట్యాంక్‌ను తొలగించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రాణాలు పోతేగాని అధికారులు పట్టించుకోరా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దశాబ్దాల కిందట నిర్మించిన ఈ ట్యాంక్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. పిల్లర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. రక్షిత మంచినీటి పథకం ట్యాంక్‌ను ఆనుకుని జనావాసాలు, పంచాయతీ కార్యాలయం ఉండడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు భయాందోళనల మధ్య పనులు చక్కబెట్టుకుని వెనుదిరుగుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను తొలగించి ప్రమాదాన్ని నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

రన్నింగ్‌లో వాటర్ ట్యాంకు..

శిథిలావస్థకు చేరుకున్న ట్యాంక్ నుంచి నేటికీ నీరు సరఫరా చేస్తున్నారు. ట్యాంక్‌కు తూర్పు, దక్షిణ భాగాల్లో రహదారులన్నాయి. ఆయా రహదారుల్లో నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికే ఇంజినీరింగ్ అధికారులు రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారని పంచాయతీ సభ్యులు చెబుతున్నారు.

నివేదిక బుట్టదాఖలు..

రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించిన అధికారుల బృందం ట్యాంక్‌ను వినియోగించవద్దని పది రోజుల కిందట నివేదిక ఇచ్చారు. ఈ నివేదికను మండల పరిషత్ అధికారులు కనీసం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. ట్యాంక్ ఎప్పుడు కూలుతుందోనని సమీప ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

పూసపాటిరేగ రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ట్యాంక్‌ను ఆనుకుని పంచాయతీ కార్యాలయం, రెండువైపులా రహదారులు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. – బొంపల సీతారాం, సర్పంచ్, పూసపాటిరేగ పంచాయతీ

ట్యాంక్‌ను తొలగించాలి..

పూసపాటిరేగలో ప్రమాదకరంగా ఉన్న ట్యాంక్‌ను తొలగించాలి. ట్యాంక్ అడుగుభాగంలో తాజాగా పెచ్చులూడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. అధికారులు స్పందించి ట్యాంక్ తొలగించి, కొత్త నిర్మాణం చేపట్టాలి. – సూర్యనారాయణ, గ్రామస్తుడు, పూసపాటిరేగ

భీమసింగి కార్మికులకు న్యాయం చేయండి

- జేసీ సేతుమాధవన్‌కు వినతిపత్రం అందజేసిన భీశెట్టి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న బాబ్జీ, తదితరులు

విజయనగరం ఫూల్‌బాగ్: భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగులకు పీఎఫ్, గ్రాట్యుటీ యాజమాన్యం చెల్లించక పోవడంతో కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని.. వెంటనే వారికి న్యాయం చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు జేసీ, సుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ సేతు మాధవన్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ.. సుమారు 280 మంది కార్మికులు, ఉద్యోగులకు 2020 – 21 నుంచి పీఎఫ్, గ్రాట్యుటీ చెల్లించకపోతే ఎలాగని ప్రశ్నించారు. కార్మికుల తరఫున లోక్‌సత్తా పోరాటం చేస్తుందన్నారు. సుగర్ ఫ్యాక్టరీ ఎం.డితో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని జేసీ హామీ ఇచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు చోడాకుల సూర్యనారాయణ, భీశెట్టి ఆదిబాబు, పిన్నింటి కృష్ణ, వర్మ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపైనే విద్యా ప్రగతి

- మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కొండపల్లి సాంబమూర్తి



పిల్లలను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి

విజయనగరం: విద్యార్థుల ఆరోగ్యంపైనే వారి విద్యా ప్రగతి ఆధారపడి ఉంటుందని విజయనగరం మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కొండపల్లి సాంబమూర్తి అన్నారు. పట్టణంలోని పువ్వాడ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరాలను పాఠశాలల యాజమాన్యాలు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. నేత్ర వైద్య నిపుణుడు మంచు కుమారస్వామి మాట్లాడుతూ.. పిల్లలు ఎక్కువగా సెల్‌ఫోన్‌కు బానిస కావడం, క్రీడలకు దూరం కావడం, శరీరానికి సూర్యరశ్మి సోకకపోవడంతో నేత్ర సంబంధిత సమస్యలకు గురవుతున్నారని చెప్పారు. కంటి సమస్యలు వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా అందుబాటులో ఉన్న వైద్య నిపుణులను సంప్రదించి, తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్వామి ఆస్పత్రి ఏఓ బాబ్జీ, పాఠశాల కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన నైపుణ్య తరగతులు



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: పారిశ్రామిక రంగంలోని సైద్ధాంతిక పరిజ్ఞానంపై స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'ఇండస్ట్రీ అండ్ అకడమియా కనెక్ట్' అనే అంశంపై వారం రోజులుగా జరుగుతున్న నైపుణ్య తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ప్రతినిధి అనూషా మాట్లాడుతూ.. బీబీఏ, ఎంబీఏ, పీజీ విద్యార్థులు విద్యతోపాటు వృత్తిపరమైన సవాళ్లపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పరిశ్రమ సంబంధిత విద్యను మెరుగుపరిచేందుకు విద్యాసంస్థ శిక్షణ శిబిరం, పరిశ్రమ భాగస్వామ్య కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ముఖ్య వక్తలను యాజమాన్యం ఘనంగా సత్కరించింది. అలాగే సదస్సులో ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేక ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్.వరూధిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే పార్కుల అభివృద్ధి

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య



పార్కు పరిసరాలను పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: ప్రజా సహకారంతోనే పార్కులు అభివృద్ధి చెందుతాయని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నగరంలోని ప్రధాన రహదారులు, పార్కులను మంగళవారం పరిశీలించారు. రింగ్‌రోడ్డు ప్రధాన రహదారిపై కొన్నిచోట్ల చెత్తాచెదారాలు ఉండడాన్ని గమనించి సిబ్బందిని మందలించారు. అలాగే అక్కడ ఉన్న ఓ పార్కును పరిశీలించారు. అందరూ కలిసికట్టుగా పార్కును నిర్వహించుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన అన్ని పార్కులను ప్రజలు అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. నగరంలో ఉన్న అన్ని పార్కుల్లో ఇప్పటికే జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో టీపీఓ అప్పలరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన బాలల సంగీత విభావరి

విజయనగరం టౌన్: అమర గాయకుడు ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని హుకుంపేటలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన బాలల సంగీత కచేరి ఆకట్టుకుంది. ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం. భీష్మారావు నేతృత్వంలో ముందుగా గుమ్చీ వద్దనున్న ఘంటసాల విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథి విష్ణుమూర్తి, రొంగలి పోతన్న, ధవళ సర్వేశ్వరరావు, వైవీవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి

- ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తి

విజయనగరం: విద్యార్థులు పరిశుభ్రత కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక బీపీఎం హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నగరపాలక కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ఈ నెల 15న బాబామెట్ట దేవీ పార్కులో స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మూడు రోజుల పాటు ప్రజలు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చెత్త రీ సైకిల్, రెడ్యూస్, రియూజ్ పట్ల ప్రజలకు సంపూర్ణ చైతన్యం తీసుకువచ్చేందుకు శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే వర్మీ కంపోస్ట్, హోమ్ కంపోస్ట్, ఆన్‌సైట్ కంపోస్టులను ప్రోత్సహించే దిశగా ప్రజలను అవగాహన కల్పిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం పేరిట పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తుందని చెప్పారు.

అమలుకాని ఎన్నికల కోడ్



గూడెపువలస ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన కూటమి నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

భోగాపురం: ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న విషయం అందరికీ తెలిసిందే. కానీ మండల అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. భోగాపురం మండలంలో ఉన్న 22 పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే అధికారులు తొలగించారు. అయితే జాతీయ రహదారికి ఆనుకుని సుందరపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద.. గూడెపువలసలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన కూటమి నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మాత్రం అధికారులు ఇంతవరకు తొలగించలేదు. దీంతో మండలంలోని ప్రజలు ఎన్నికల కోడ్ ఒక్క వైఎస్సార్‌సీపీకే మాత్రమే వర్తిస్తుందా.. మిగిలిన పార్టీలకు వర్తించవా.. అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ కిషోర్‌కుమార్‌ల దృష్టికి తీసుకెళ్లగా వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నాతవలస పశువైద్యశాలకు నూతన భవనం

డెంకాడ: మండలంలోని నాతవలస పశు వైద్యశాలకు నూతన భవనం మంజూరైందని పశుసంవర్థక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ దామోదర్ అన్నారు. మండలంలోని నాతవలస గ్రామీణ పశువైద్యశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో శిథిలావస్థకు చేరుకున్న ఆస్పత్రుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో భోగాపురం సహాయ సంచాలకుడు ఉమాశంకర్ పాత్రో, పశువైద్యుడు కె.సంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో ఇక్కట్లు

నెల్లిమర్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం అప్రకటిత విద్యుత్ కోతలు అమలుచేశారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాలున్న మండల పరిషత్ ప్రాంగణం, విజయనగరం ప్రజలకు తాగునీరు సరఫరా చేసే మాస్టర్ పంప్ హౌస్, ఈవీఎం గొడౌన్, మద్యం గొడౌన్, తదితర ప్రాంతాలకు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరగక అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడ్డారు. అలాగే కేజీబీవీ, మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో తాగునీటి మోటార్లు పనిచేయక విద్యార్థులు అవస్థలు ఎదుర్కొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి..



ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ పర్యవేక్షించారు. – విజయనగరం టౌన్

సీపీఐ పోరుబాట..



ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు హామీ అమలు చేసే వరకు భారత కమ్యునిస్టు పార్టీ (సీపీఐ) పోరుబాట కొనసాగుతుందని సీపీఐ విజయనగరం నియోజకవర్గ కార్యదర్శి బుగత అశోక్ తెలిపారు. మంగళవారం స్థానిక అమర్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో పోరుబాటకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఇసుక, ఇటుక, ఇనుము, సిమెంట్, తదితర నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎ. జగన్నాథం, పి. అప్పలరాజు, చిల్లా చిట్టిబాబురెడ్డి, రామకృష్ణ, వెలగాడ రాజేష్, పి. గౌరీశంకర్, బూర వాసు, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం ఫూల్‌బాగ్

అందుబాటులో ఉండాలి..



సచివాలయ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని ఎంపీడీఓ కె. రామకృష్ణరాజు సూచించారు. మండలంలోని తంగుడుబిల్లి, రామతీర్థం సచివాలయాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు సత్వర సేవలను అందించాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అంతకుముందు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. – నెల్లిమర్ల రూరల్

రహదారి భద్రతా ర్యాలీ..



రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ సిబ్బంది మంగళవారం పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. తొలుత స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వద్ద ప్రారంభమైన ర్యాలీ మయూరి కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ మాట్లాడుతూ.. వాహనచోదకులు రహదారి భద్రత మార్గదర్శకాలను పాటించాలని కోరారు. ర్యాలీలో విజయనగరం డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఆదినారాయణ, కార్మిక సంఘాల ప్రతినిధులు, సెక్యూటీ సిబ్బంది పాల్గొన్నారు. – విజయనగరం అర్బన్

వైభవంగా జొన్నాడ పైడితల్లి జాతర

- పోటెత్తిన భక్తులు
- అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ దంపతులు



పైడితల్లి అమ్మవారు



అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పద్మావతి దంపతులు



జాతరలో భక్తుల సందడి

డెంకాడ: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, భక్తుల కొంగుబంగారమైన జొన్నాడ పైడితల్లి జాతర మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మ దర్శనానికి ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పదావ్మతి దంపతులు పైడితల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని జొన్నాడ, ఆకుటపేట, బొడ్డవలస, చింతలవలస, డి.తాళ్లవలస, గంట్లాం, మోపాడ, తదితర గ్రామాలకు చెందిన భక్తులతో పాటు విజయనగరం మండలంలోని చెల్లూరు, బడ్డుకొండపేట, మలిచర్ల, సుంకరపేట గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పతివాడ అప్పలనారాయణ, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్ కోరాడ రమణి, కోటినాయుడు దంపతులు, ఎంపీటీసీ సభ్యురాలు త్రిపురగిరి దేవి దంపతులు అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు.

లక్ష్యాలను అధిగమించాలి

- కమిషనర్ పల్లి నల్లనయ్య



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: ఆర్థిక సంవత్సరం ముగిస్తున్న నేపథ్యంలో పన్నుల వసూలు లక్ష్యాలను అధిగమించాలని రెవెన్యూ సిబ్బందికి, అడ్మిన్ కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వివిధ రకాల పన్నులన్నీ కలిపి రూ. 78 కోట్ల మేర డిమాండ్ ఉందన్నారు. ప్రతిరోజూ లక్ష్యాలను విధించుకుని వసూలు చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఏఓ సీతారామమూర్తి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.